# మనిషికి తూమెడు వడ్లు

మాకు నాటకాలు నేర్పేది పున్నయ్య పంతులని తెలుసుగదా! పంతులు ఊర్లెకచ్చి యాడాది దాటింది. ఈ కొడుకు దగ్గరుండే టైం అయిపోయింది. ఇప్పుడు చిన్నకొడుకు దగ్గరికి నామాపురం పోవాలె. ఆయినతప్పితే ఇంకో పంతులు లేడాయె మాకు. ఎట్లా..? పంతులు లేకుంటే మా మాల్లెం ఇచ్చుకపోతది.

ఒకనాడు మమ్మల్నందరినీ కూసోబెట్టి నేను ఎల్లిపోతున్ననని చెప్పిండు పంతులు. మాకు కండ్లల్ల నీళ్లు తిరిగినయి. ఎందుకో పంతులు ఎల్లిపోతున్నడంటే మాత్రం బాధగా ఉంది. పంతులు గూడా ఏడ్సుడే గాదు.

పొద్దంతా ఎప్పుడు టైందొరికినా పంతులు ఇంటికే పోదుము. పగటిపూటయితే కనీసం నలుగురైదుగురయినా జమయిదురు. రాని పాటలను అభ్యాసం చేసుకుందురు. పంతులు నాకు పల్లీల హార్మొని నేర్పిండు. సరిగమపదనిసలు ప్లే చేసి పాటలు పద్యాలమీద ఎలా పల్లీలు వేయాలో నేర్పిండు. ఒకచేత పల్లీలు వేయడం, మరో చేత తిత్తిని ఆడించడం ప్రాక్టీసు ఉంటే తప్ప కుదరదు. అట్లా తాళం కొట్టడం కూడా పంతులే నేర్పిండు.

పంతులు వెళ్లి పోతున్నాడంటే మా కొండయ మామకైతే తిండి గూడా తినబుద్ధిగాలేదు. రెండురోజులు తిండి లేకున్నా ఉంటడుగానీ వేషం లేకుండా ఉండలేడు కదా! మొన్న పెండ్లిచూపులప్పుడు ఇట్లనే జరిగింది. పిల్లగాన్ని చూసేందుకు వస్తున్నమని అక్కపెల్లి నుంచి చెప్పి పంపింద్రు.

అంతకుముందు రోజే ఇక్కడ నాటకం. మామది శంకరుని ఏశం. మీసాలు తీసెయ్యాలె. 'నిన్ను చూడడానికి వత్తుంద్రు. వద్దురా' అని తాత. ఏషం ఏస్తనని మామ. అఖరుకు ఏయ్యనేఏసిండు. చూడచ్చినోళ్లకు బోడమూతితో కనిపించిండు. వాళ్లు ఏమనుకున్నరోగానీ పిల్లగాడు నచ్చలేదని చెప్పి పంపింద్రు.

ఒక్కమామనేగాదు. మాల్లెంలో అందరూ అదే పట్టుదలతో ఉన్నరు. మా దాసు చిన్నాయినకు ఒక్కడే కొడుకు. చిన్నపిల్లగాడు. వారం పదిరోజులు బాగలేడు. చేతులమీదనే ఎత్తుకున్నరు. అయినా చిన్నాయిన రియార్సల్‌కు తప్పియ్యలేదు.

బందూకుల మల్లేశం ఏరువడ్డడు. ఊరవుతల ఇల్లు. భార్య ఒక్కతే ఉంటది. ఒక్కదానికి భయమైతదని భార్య రోజూ ఏడుత్తదట. 'నిన్నేం మింగదితియ్యి. తలుపులు పెట్టుకుని పండుకునేందుకేంద'ని తిడుతడట.

అయ్యవ్వ భయానికి ఇంటికిపోకుండా ఎడ్లకొట్టం దగ్గరనే నిద్రదీసేటోళ్లు కొందరున్నరు. ఇప్పుడెంపోవుడు ఇంటికని కొందరు మా ఇంట్లనే నిద్రదీత్తురు. మా అమ్మ ఇల్లూడ్చుకుంట తిడుతుంటే లేచిపోదురు.

వీళ్లందరిదీ ఒక ఎత్తయితే బాల్‌నర్సుది మరోఎత్తు. అర్ధరాత్రిపూట ఊరుకూరుదాటి ఎల్లమ్మ గుడికాడికి పోవాలె. కుక్కలు వెంటపడుతయి. చిమాన చీకటి.ఎండాకాలమైతే దొంగల భయంగదా.

ఒకనాడు రియార్సల్ అయినాక కోటగడ్డదిగి ఇంటికి పోతుంటే దొంగోడే అనుకుని రాళ్లతోని కొట్టింద్రట. 'నేను బాల్‌నర్సునురో' అని మొత్తుకుంటే ఎవలు ఇంటరు. బొబ్బల బొబ్బ నాలుగు ఉతికింద్రట. అయినా రియార్సల్ మానలేదు.

అట్లాంటిది పంతులు పోతున్నడంటే అందరికీ బాధనే! ఇకముందు నాటకాలు ఉండవేమోనన్న భయం మొదలయింది. అందరికీ కొండయమామ మీదనే నమ్మకం. ఎవలు కాదన్నా మామమాత్రం ఏదో ఒకమార్గం ఆలోచిస్తాడనుకున్నరు. అనుకున్నట్టుగానే మామనే ముందువడి తిరుగుతున్నడు.

ముందుగా గంగరాములును కలిసిండు మామ. వచ్చిన యాడాదికొద్దీ గంగరాములు భార్య మాత్రం పంతులుమీద కోపంతోనే ఉన్నదట. ఎప్పుడుపోతడనే

చూస్తందట. 'నాకేమన్నమనులు పంచిచ్చిండా మాన్యాలా..? ఇల్లరికం ఇచ్చిన కొడుకు దగ్గరికి వస్తడా' అంటుందట. మా కొండయమామ బాగా ఆలోచించిండు. గంగరాములు భార్యను ఒప్పిస్తే చాలనుకున్నడు.

సభ్యులందరినీ కలిసి మాట్లాడిండు మామ. నేనుకాక మొత్తం పదమూడుమంది. 'ఇంకో యాడాది ఉండుమందాం. మనిషికి తూమెడు వడ్లు ఇద్దాం' అన్నడుమామ. మామాల్లెంలో కూలీలు, జీతగాళ్లున్నరు. వాళ్లకు ఎద్దులేదు. ఎవుసంలేదు. అయినా సరే అన్నరు. కానీ ఈ విషయం ఇండ్లల్ల తెలువద్దన్నరు.

కొండయమామ గంగరాములు భార్యతోనే మాట్లాడిండు. 'రామక్క రామక్కా. మేము పదమూడు మందిమున్నం. ఇంటికి తూమెడు వడ్లు ఇస్తం. ఇంకోయాడాది పంతులును ఇక్కడనే ఉండుమను. కాదంటే ఇంటికి మానెడు బియ్యంగూడా తెస్తం' అని చెప్పిండు.

క్షణాల్లో ఆదాయాన్ని లెక్కగట్టుకుంది రామక్క. ఏంలేదన్నా పదముత్తుమువడ్లు. ఆరుబస్తాలు. ఇంత ఆదాయం వస్తుంటే ఎట్లా కాదంటుంది? భర్తకు ఏం చెప్పిందో గని గంగరాములు మరునాడే తమ్మునికి నాయిన ఇక్కడనే ఉంటడని చెప్పి పంపిండట.

పంతులు ఇక్కడనే ఉంటడని తెలిసినంక మాకుపండుగే అయింది. పంతులుకు కండ్లపొంట నీళ్లు రాలినయి. 'మీరు నాకొడుకులసొంటోళ్లు. ఉన్నోళ్లుంటరు లేనోళ్లుంటరు. తూమెడు వడ్లు వద్దుబిడ్డా..ఇంటికొకనాడు తిండిపెట్టుండ్రి సాలు. సచ్చేదాక మీతోనే ఉంట. మీ పాతబట్టలుంటే ఇయ్యుండ్రి కట్టుకుంట' అన్నడు.

ఈమాట వింటుంటే మాకు దుఃఖమచ్చింది. వద్దని సర్దిచెప్పినము లేదంటే ఇంటికి పిడికెడు బియ్యం పెట్టుండ్రి. నాదినేను వండుకుని తింటనంటడు. అట్లగూడా వద్దని సర్దిచెప్పినము.

పంతులుకు కోపం ఎక్కువ. అనుకున్నది అనుకున్నట్టు జరుగాలె. లేదంటే చిటపట మంటడు. పాటలు నేర్పేటప్పుడు అంతే! రెండుమూడుసార్లు చదివి వినిపిస్తడు. మళ్లీ తప్పు చదివినమనుకో. చేతులున్న పుస్తకంతోనే ఇరిసికొడుతడు. రియార్సల్ చూడడానికి ఎంతోమంది వస్తరు. వాళ్లు వీళ్లున్నరని కూడా చూడడు. అయినా ఎవలు తప్పు పట్టుకోరు.

ఆ కోపమంతా ఎటు పోయిందోగాని ఇప్పుడు మాత్రం పంతులులో ఇవేవీలేవు శాంతంగా ఉన్నడు. అయినా మా భయం మాకుంది.

'ఇదువరదాక ఏదో నేర్చుకున్నం ఆడినం. ఐపోయింది. ఇప్పుడు మనము ఒకట్రూప్ చేసుకోవాలె. ఐదు నాటకాలు మంచివి నేర్చుకోవాలె. ఒకరిక్షాగూడా కొనుక్కోవాలె. రిక్షాకు

మైకుపెట్టి ఆకులు గట్టి ఊరంతా తిప్పి అడ్విటేజ్ చెయ్యాలె. సంచారం బయిలెల్లినమంటే కనీసం ఊరికి ఐదు ఆటలాడుకుంటూ పది ఊర్లయిన తిరుగాలె' అన్నడు పంతులు.

ఇది మా కొండయమామ ఎన్నటినుండో అనుకుంటున్న మాటలు. ఇప్పుడు పంతులు నోటివెంట వినేసరికి మామకు పట్టరాని సంతోషం కలిగింది. ఏదో అద్భుతం చెప్పినట్టుగా ఉంది. నిజంగా అట్లా చేస్తామా అనిపించింది. అదేమాట పంతులును అడిగిండు మామ.

'నేను చేస్తనా లేదా చూడు' అన్నడు పంతులు. మేము పట్టుదలగా రియార్సల్ మొదలు వెట్టినం.

ఈ కథ ఇట్లా ఉంటే పంతులుకొడుకులు కొట్లాడు కోవడం మొదలెట్టింద్రట. తనతండ్రి నాటకాలు నేర్పి బాగానే సంపాదిస్తున్నడని అందులో తమకు కూడా వాటాగావాలని అడుగుతున్నరట గంగరాం తమ్ముండ్లు.

పంతులుకు మాత్రం మా నాటకాలే లోకమైనవి. ఇంతకుముందు పాత్రలు రాయించుదుము. రాసినందుకు మల్లయ్య సేటుకు పదిరూపాయలిద్దుము. ఇప్పుడు పంతులే వట్టిగనే రాసిత్తుండు. తెల్లతాపు పేపర్లు కూడా తనే కొనుక్కత్తుండు. ఊరిలో ఎవరినోటవిన్నా మా పాటలే.

ఎందరో కొత్తవాళ్లు మాతో చేరాలనుకుంటున్నరు. ఇప్పుడు ఆ విషయం మామ చేతిలోలేదు. పంతులు చేతుల్లో ఉంది. కొత్తవాళ్లు వచ్చేదిలేదు. పాతవాళ్లు పోయేదిలేదంటున్నడు పంతులు. ఇద్దరికి తబలా కొట్టుడు నేర్పిండు. రెండు తాళాల జతలు రియార్సల్ పూర్తయ్యేసరికి అందరి చేతుల్లోంచి తిరిగాల్సిందే.

రోజూ రియార్సల్ మొదలు పెట్టేప్పుడు దేవుడిపోటోకు దండం పెట్టడం బొట్టు పెట్టడం మాకు మనిషికింతా బొట్టుపెట్టడం కొత్తగా పెట్టిండు పంతులు. ఇకముందు బాగోతాలు యక్షగానాలు నేర్వద్దని కేవలం నాటుకాలే నేర్వాలని మాతో చెప్పిండు. మేముగూడా సరేనన్నం. ఏ పండుగైనా ఒకనాటకం వెయ్యాలన్నడు.

ఇదంతా చూసినాక మాకుమొదట ఆటలు నేర్పిన జంగం పంతులు ఏమనుకున్నాడో! తనుగూడా నాటకం నేర్పిస్తానని ఎవరైనా ఇష్టం ఉన్నవాళ్లు రావచ్చునని అందరికీ చెబుతున్నడట. జంగమమ్మకూడా నోరుతెరవడం లేదట.

ఈ విషయం విన్నాక మా మ్యాల్లెం మనుషులు జారిపోకుండా చూసిండు కొండయమామ. ఎవరినో ఆరేడు మందిని కూడగొట్టి జంగం పంతులు మ్యాల్లం మొదలువెట్టిండట.

"ఊర్లె రెండు మ్యాల్లాలెందుకు..? జంగం పంతులు మీకు తెలిసినోడేనాయె. మీరు అక్కడనే నేర్చుకోం౦డ్రి. నేను నామాపురం ఎల్లిపోత. మీకు మీకే కొట్లాటలయితయి." పున్నయ్య పంతులు ఒకనాడు అన్నడు.

"నేర్సుకుంటే మీ దగ్గరనే నేర్సుకుంటం. లేదంటే మానేత్తం. అంతేగనీ జంగం పంతులు దగ్గరికి పోము." మా కొండయమామ చెప్పిండు. మేమంతా అవునంటే అవునన్నం.

ఆ మరునాడే పంతులు చిన్నకోడలు వచ్చిందట. ఇద్దరు యారండ్లకు పెద్ద పంచాది అయిందట. "ఇంత సంపాయిస్తండని ఉండుమంటున్నవు. లేకుంటే ఎందుకు ఉండుమందువే" అని చిన్నకోడలు పెద్దకోడలును అన్నదట. నాగురించే కొట్లాట గావట్టెనని పంతులు మనసునొచ్చుకున్నడట. వెళ్లిపోదామంటే మమ్ముల్ని విడువడానికి ఇష్టంలేదు. ఉందామంటే ఇంట్లకొట్లాటలు. పంతులు మస్తు బాధపడుతుండు.

ఇదంతా చూసినాక మాకొండయమామ 'పంతులూ... మీరు వెళ్లిపోం౦డ్రి. నడుమల మీకెందుకు బాధ" అన్నడు. మా పంతులు మారు చెప్పలేదు. నాలుగురోజులు కనిపించలేదు. మేమంతా వెళ్లిపోయిండనుకున్నం. ఆశ జాలిచ్చుకున్నం. సామాన్లన్ని ముల్లెగట్టి దూలాల మీదికి ఎక్కిచ్చినం.

ఐదవనాడు కొంత సామానుతో వచ్చిండు పంతులు. రెండుగిన్నెలు, కొంత వంట సామానుంది. ఊర్లెనే చిన్న ఇల్లు కిరాయికి తీసుకున్నడు. 'నాదినేను వండుకుంట. నా తిండి నేను తింట. కోపాలద్దు కొట్లాటలద్దు. మీరు వెళ్లిపొమ్మనేదాక పోను' అన్నడు.

ఇచ్చుకపోతదనుకున్న మ్యాల్లెం మల్లా మూటికచ్చింది. మా కొండయమామ సంబూరం చెప్పరాదు. "ఒరేయ్... పంతులు మనకోసమే ఉన్నడు. ఏలోటు లేకుండా చూడాలె" అన్నడు.

కాయ, పండు, మాకు ఏది కనిపించినా పంతులు ఇంట్ల ఉండాల్సిందే. ఎం౦డ్రికాయలు, చాపలు, రొయ్యలు పంతులు ఇంట్ల నీసు లేని దినమే లేదు. ఒక్కొక్కనాడు బువ్వకూర మేమే వండుదుంటిమి. ఎవలింట్ల పండుగైనా పంతులును తోలుకపోదురు.

ఇదంతా చూసినంక ఒకనాడు పంతులు కండ్లకు నీళ్లు తీసుకుని 'కన్న కొడుకులన్నా నన్ను ఇంత మంచిగ చూసుకోలేదురా. నాకు ముగ్గురు కొడుకులు గాదు. ఇరువైమంది కొడుకులు' అన్నాడు.